సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 7 । మే । 2024



భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం 8లో



ఓల్డ్ సిటీ.. న్యూలుక్ 10లో



అతివలే నిర్ణేతలు 10లో

వైజాగ్ మాల్యా.. వంశీ!

అప్పు ఇస్తే.. అంతే సంగతులు

- ఫైనాన్స్ సంస్థలకు ముప్పతిప్పలు పెట్టిన వంశీకృష్ణ
- అప్పు తీర్చడంలేదంటూ 29 సార్లు కేసులు పెట్టిన ఆయా సంస్థలు
- మార్గదర్శి చిట్స్ చెల్లింపు విషయంలోనూ నోటీసులు
- ఎన్నికల్లోనూ అదే డీఫాల్టర్‌గా మిగిలిపోయిన వైనం
- ఈసారీ అదే ఫలితం పలకరిస్తుందనే ఆందోళన

'మీరు నిర్దేశించిన గడువులోగా తీసుకున్న అప్పు చెల్లించలేదు. కాబట్టి మీ ఆస్తుల్ని జప్తు చేస్తాం. ఇదిగో ఈ కోర్టు నోటీసులు తీసుకోండి.'

ఇది విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ తరచూ వినేమాట.

మీకు మాల్యా తెలును కదా.. బ్యాంకుల నుంచి కోట్ల రూపాయలు అప్పులు తీసుకొని ఎగ్గొట్టేసి విదేశాలకు చెక్కేశారు. కానీ.. మన వైజాగ్ మాల్యా వంశీకృష్ణ మాత్రం.. అప్పులు ఎగొట్టేందుకు ప్రయత్నించి.. కోర్టుల నుంచి మొట్టికాయలు తిని.. తిన్నదంతా కక్కిన ఘనుడు.

ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పు తీసుకోవడం.. వారు చెల్లించమని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోకపోవడం.. రుణాలు ఎగ్గొట్టేందుకు ప్రయత్నించడం.. చివరికి కోర్టు నుంచి నోటీసులొస్తే.. మరో చోట అప్పోసొప్పో చేసి ఆ రుణం తీర్చడం.. మళ్లీ నోటీసులు.. మళ్లీ కోర్టు చుట్టూ ప్రదక్షిణలు.. ఇది వంశీకృష్ణకు హాబీగా మారిపోయింది. దాదాపు విశాఖలో ఉన్న సింహభాగం ఫైనాన్స్ కంపెనీల దగ్గర వంశీకృష్ణ.. ఓ డీఫాల్టర్ అనే ముద్ర పడిపోయింది. కేవలం అప్పుల విషయం లోనే కాదు.. రాజకీయాల్లోనూ వంశీ ఒక డీఫాల్టర్ అనే చెప్పుకోవాలి.



సాక్షి, విశాఖపట్నం: వంశీకృష్ణ శ్రీనివాస్ పేరు చెబితే ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకులు భయపడుతుంటాయి. అప్పు ఇస్తే.. తొలుత ఆయన చుట్టూ.. తర్వాత కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది బాబోయ్ అంటూ బ్యాంకర్లు తలలు పట్టుకుంటారు. షిప్పింగ్ కంపెనీని నడుపుతున్న వంశీ.. దాన్ని నడిపేందుకు పలు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకుల వద్ద నుంచి రుణాలు తీసుకునేవారు. 2011 నుంచి వంశీకి ఇదే పని. ఏ ఫైనాన్స్ కంపెనీ కనిపిస్తే.. వారి దగ్గరికి వెళ్లడం.. అప్పులు చెయ్యడం.. ఆనక దాన్ని చెల్లించకుండా తప్పించుకు తిరగడమే అలవాటు మారిపోయింది.

మార్గదర్శితో మొదలై...

2011లో రామోజీరావుకు చెందిన మార్గదర్శిలో చిట్ వేశారు. మధ్యలోనే ఆ చిట్‌ని పాడేసి డబ్బులు తీసుకున్నారు. మిగిలిన నెలల చిట్ డబ్బుల్ని చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు ప్రయత్నించారు. నాలుగు నెలలు వరుసగా నోటీసులిచ్చినా స్పందించకపోవడంతో మార్గదర్శి కోర్టులో పిటిషన్ వేసి.. ఆ డబ్బులు ముక్కు పిండి మరీ వసూలు చేసుకుంది. మరోసారి చిట్ వేసేందుకు మార్గదర్శి అనుమతి ఇవ్వకపోవడంతో సంక్షేమ చిట్స్ అనే మరో సంస్థను పట్టుకొని.. అక్కడా డబ్బులు కొల్లగొట్టి సేమ్ సీన్ రిపీట్ చేశారు.

ఫైనాన్స్ సంస్థలకూ శఠగోపం

చిట్‌ఫండ్ సంస్థలకు ఎగనామం పెట్టిన వంశీ.. 2015 నుంచి వరుసగా దొరికిన ఫైనాన్స్ సంస్థ దగ్గర దొరికినంత రుణాల్ని తీసుకున్నారు. ఆ తరువాత ఫైనాన్స్ సంస్థలకు శఠగోపం పెట్టేశారు. కొన్ని సంస్థలు చివరికి కోర్టులను ఆశ్రయించి వంశీ దగ్గర నుంచి వసూలు చేసుకున్నాయి. మరికొన్నింటికి డబ్బులు చెల్లించలేని స్థితిలో ఉండటంతో ఆస్తుల్ని జప్తు చేసుకున్నాయి. కొంత మంది వ్యక్తుల దగ్గరా డబ్బులు తీసుకొని వారికి కూడా రిక్త హస్తాలు చూపించి డబ్బులు ఎగ్గొట్టాలనుకున్న ఘనుడు వంశీకృష్ణ. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 21 సార్లు డీఫాల్టర్‌గా బ్యాంకుల చుట్టూ తిరిగాడు మన వైజాగ్ మాల్యా.

రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా...

ఎమ్మెల్యేగా గెలిచి.. ఫైనాన్స్ సంస్థలను బెదిరించి.. అప్పులు మాఫీ చేసుకోవాలనే కుయుక్తితో రాజకీయాల్లోకి అడుగు పెట్టిన వంశీ గురించి ప్రజలకు ముందే తెలిసిపోయింది. 2009లో రాజకీయ ఆరంగ్రేటం చేసి పీఆర్పీ తరపున పోటీ చేసిన వంశీ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో యాదవ సామాజికవర్గం నుంచి శాసనసభకు ఒకర్ని పంపించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు టికెట్ కేటాయించారు. అప్పుడూ వంశీ రుణాల గోల గురించి తెలిసిన తూర్పు నియోజకవర్గ ప్రజలు ఈ వైజాగ్ మాల్యాని ఇంటికే పరిమితం చేశారు. వంశీ బుద్ధి తెలుసుకున్న పార్టీ 2019లో సీటు ఇవ్వకుండా పక్కనపెట్టింది. ఇక 2021లో 21వ వార్డులో కార్పొరేటర్‌గా అవకాశం కల్పిస్తే అతికష్టమ్మీద గట్టెక్కారు. వంశీ వక్రబుద్ధిని ప్రజలు ముందే గ్రహించి ప్రతి ఎన్నికలోనూ పాఠం నేర్పినా.. సదరు వైజాగ్ మాల్యా మాత్రం తన అప్పుల పరంపరని కొనసాగిస్తూ ఫైనాన్స్ సంస్థలకే కన్నం వేసేందుకు యత్నించారు.

ఈ ఎన్నికల్లోనూ పరాభవం తప్పదా?

తూర్పు ప్రజలకు తన రుణ స్వరూపం తెలిసిపోయిందని అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. కన్నతల్లిలా ఆదరించిన వైఎస్సార్‌సీపీని వదిలిపెట్టి.. జనసేనలోకి చేరారు. తూర్పులో ప్రజల నుంచి పరాభవం తప్పదని దక్షిణ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. వాస్తవానికి వంశీ యవ్వారం దక్షిణ ప్రజలకే ఎక్కువగా తెలుసు. ఎందుకంటే సదరు వంశీ షిప్పింగ్ సంస్థ ఎక్కువగా అక్కడే కార్యకలాపాలు నిర్వహించింది. దక్షిణలోనే విశాఖ పోర్టు కావడం.. సదరు వంశీ చేసిన అడ్డగోలు వ్యవహారాల గురించి ఆ నోటా ఈ నోటా అక్కడ ప్రజలు తెలుసుకున్నారు. అందుకే.. వంశీ ఓట్లు అడగడానికి వస్తుంటే.. తమని కూడా అప్పులు అడగడానికి వస్తున్నాడేమోనని ప్రజలు భయపడుతున్నారు. దీంతో 2024 ఎన్నికల్లోనూ వంశీకి పరాభవం తప్పదని సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నేడు సీఎం జగన్ గాజువాక రాక

- సాయంత్రం 5 గంటలకు పాతగాజువాక జంక్షన్‌లో ఎన్నికల ప్రచార సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



గాజువాక : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం గాజువాక రానున్నారు. సాయంత్రం 5 గంటలకు పాతగాజువాక జంక్షన్ 60 అడుగుల రోడ్‌లో జరగనున్న ప్రచార సభలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఏర్పాట్లను సోమవారం పర్యవేక్షించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తదితరులతో కలిసి 60 అడుగుల రోడ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గాజువాక నియోజకవర్గంలో ప్రచార సభలో పాల్గొంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ సభలో పాల్గొనాలని కోరారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, పార్టీ నాయకులు ఉరుకూటి అప్పారావు, రొంగలి జగన్నాథం, రెడ్డి జగన్నాథం, గుడివాడ లతీష్, సిరట్ల శ్రీనివాస్, మొల్లి చిన్న, కొసిరెడ్డి గణేష్, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



పాతగాజువాకలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

సీఎం షెడ్యూల్ ఇలా..

బీచ్‌రోడ్డు : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు రాజమండ్రి నుంచి విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు 12.40 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వెళ్తారు. అక్కడ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని తిరిగి 4.40 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో గాజువాక చేరుకొని.. సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన ప్రచార సభలో పాల్గొంటారు. సభ అనంతరం 6 గంటలకు తిరిగి విశాఖ ఎయిర్ పోర్టుకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్తారు.

మోదీ కూడా యూటర్న్ తీసుకున్నారు

- చంద్రబాబు స్క్రిప్ట్‌నే ప్రధాని చదివారు
- ఓట్ల కోసం అబద్ధాలు చెప్పడం బాధాకరం
- మోదీ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి అమర్‌నాథ్



అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రుల సెంటిమెంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చంద్రబాబు స్క్రిప్ట్‌నే మోదీ చదివారని, రాష్ట్ర ప్రభుత్వంపై మోదీ, చంద్రబాబు విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. చట్టివానిపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించొద్దని 1,180 రోజులుగా కార్మికుల చేస్తున్న పోరాటాన్ని, వారి సెంటిమెంట్‌ను ప్రధాని ఏమాత్రం గౌరవించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించబోమని ప్రధాని చెబితే పోటీ నుంచి తప్పుకుంటానని ప్రకటించానని, అయితే స్టీల్‌ప్లాంట్‌పై కనీసం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని, అమరావతి కుంభకోణంగా మారిందని గతంలో మోదీ విమర్శలు చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం ప్రధాని యూటర్న్ తీసుకుని అబద్ధాలు చెప్పడం బాధాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన రూ.22 వేల కోట్ల నిధుల విడుదల కోసం చాలా కాలంగా ఎదురు చూశామని, కానీ మోదీ ప్రభుత్వం ఎందుకు క్లియరెన్స్ ఇవ్వలేదని అమర్‌నాథ్ ప్రశ్నించారు. బీజేపీతో టీడీపీ అంటకాగుతూ రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టు పెట్టడం చీకటి ఒప్పందం కాదా అని అన్నారు. రైల్వే జోన్ కార్యాలయం నిర్మించేందుకు భూమి ఇవ్వలేదంటూ ప్రధాని చేసిన ప్రకటనను మంత్రి ఖండించారు. విశాఖలో అత్యంత విలువైన 43 ఎకరాల స్థలాన్ని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి అబద్ధాలు చెప్పడం సమంజసం కాదన్నారు. రైల్వే జోన్, పోలవరం తదితర అంశాలపై ప్రధాని ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం ప్రజలను విస్మయానికి గురి చేసిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అసెంబ్లీలో స్వాగతించిన టీడీపీ.. ఇప్పుడు విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడని, ఈ ఎన్నికల్లో కూటమి ఓటమి ఖాయమన్నారు.

- సబ్బవరం మండలం సాయినగర్‌లో పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆరోపణలను ఖండించారు. చంద్రబాబు మాటలే మోదీ నోటవచ్చాయని, టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ఆమోదం తెలిపినట్లేనని హెచ్చరించారు.

టీడీపీ నేత నుంచి రూ.10 లక్షల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును పెందుర్తి పోలీసులకు అప్పగిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలోని వేపగుంట మీనాక్షి కన్వెన్షన్ సమీపంలో టీడీపీ నేత దంతులూరి వెంకట దుర్గ ప్రశాంత్ వర్మ అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాని మోదీ సభకు జనాలను తరలించిన జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు వారికి పంపిణీ చేయడానికి నగదు తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వర్మ వద్ద లభించిన రూ.10 లక్షలకు ఎటువంటి ఆధారం లేకపోవడంతో డబ్బు సీజ్ చేసి పెందుర్తి పోలీసులకు అప్పగించారు.

రెండో రోజూ.. నిస్సిగ్గుగా..

పోస్టల్ బ్యాలెట్‌లో కొనసాగిన టీడీపీ ప్రలోభాల పర్వం

మహారాణిపేట: ఓటమి భయం రోజు రోజుకూ పెరిగిపోతుండటంతో టీడీపీ అన్ని అడ్డదారులూ తొక్కుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతున్న సమయంలో ఆ పార్టీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లే ప్రయత్నాలు కొనసాగించారు. సిగ్గు ఎగ్గూ వదిలేసి ప్రలోభాలకు గురి చేసేందుకు గోతికాడి నక్కల్లా కాపు కాశారు. తాయిలాలేవీ వద్దంటూ ఉద్యోగులు చెబుతున్నా.. కాళ్లావేళ్లా పడి బతిమాలుతూ ఓటు కోసం వికృతంగా వ్యవహరించారు. ఓటు కోసం ఎవరు వచ్చినా.. వారి వెంట పడుతూ ఇబ్బందులకు గురి చేశారు.

పోస్టల్ ఓటింగ్ తొలి రోజున ఓట్ల కోసం ప్రలోభాల పర్వం ప్రారంభించిన టీడీపీ నేతలు.. రెండో రోజూ అదే బాటలో నడిచారు. బాధ్యతాయుతంగా వ్యవహరించే ఉద్యోగులను కూడా కొనుగోలు చేసేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉద్యోగులు చీదరించుకుంటున్నా.. వారి వెంటపడి ఇబ్బందులకు గురిచేస్తూ ఓట్లు దండుకోడానికి నానా పాట్లు పడ్డారు. ఆంధ్రా యూనివర్సిటీ హైస్కూలుకు ఎదురుగా ఉన్న పోలింగ్ కేంద్రం సమీపంలో సోమవారం ఉదయం నుంచే గంటా, వెలగపూడి అనుచరులు తిష్టవేశారు. వచ్చిన ప్రతి ఓటరునీ తమ పార్టీకి ఓటు వేయాలంటూ డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేశారు. కొందరి దగ్గర నుంచి యూపీఐ పేమెంట్ చేస్తాం.. ఫోన్ నంబర్ ఇవ్వండంటూ వెంటపడ్డారు. **ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే.. వాళ్లని బతిమాలుతూ కాళ్లా** వేళ్లా పడుతూ ఫీట్లు చేశారు. అన్ని విధాలా ప్రలోభాలకు గురి చేసి ఓట్లు రాబట్టుకునేలా టీడీపీ నేతలు ప్రయత్నం చేశారు. పోలింగ్ కేంద్రాల ఎదురుగా కూర్చుని ఓటర్ల ఫోన్ నంబర్లను సేకరించడం, వారికి వాగ్దానాలు చేయడంతో పాటు.. రెస్టారెంట్స్‌లో ఫ్యామిలీతో గడిపేందుకు ప్రత్యేక కూపన్లు పంచుతూ నానా పాట్లు పడ్డారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండే ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలని ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించారు. టీడీపీ నాయకులు పోతన్న రెడ్డి, కాళ్ల శంకర్, బొట్ట రమణ ఏయూ అవుట్‌గేట్ వద్ద ఓటర్లకు ఎదురు పడి అన్ని వైపులా నిల్చొని వారిని ప్రలోభాలకు గురిచేసేలా మాట్లాడారు. వీరితో పాటు మరో 10 మంది వరకు టీడీపీ కార్యకర్తలు ఓటర్ల ఫోన్ నంబర్లు, చిరునామాలు, పేర్లు పుస్తకంలో నమోదు చేసుకోవడం కూడా **కనిపించింది. ఆ తర్వాత కొందరికి ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు పంపించినట్లు తెలిసింది.**



ప్రభుత్వ ఉద్యోగి నుంచి వివరాలు సేకరిస్తున్న టీడీపీ నాయకుడు(తెలుపు చొక్కా)

పోస్టల్ ఓటింగ్ 7,722

మహారాణిపేట: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రెండో రోజైన సోమవారం కొనసాగింది. జిల్లాలో మొత్తం 13,076 మంది ఉద్యోగులు ఉండగా.. 8,974 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలిరోజు ఆదివారం 3,152 మంది, సోమవారం 5,822 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇతర జిల్లాల సిబ్బంది 5,389 మంది ఉండగా 3,036 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలిరోజు 1,136 మంది, సోమవారం 1,900 మంది ఓటు వేసినట్లు వెల్లడించారు. మంగళవారం ఓపీవోలు, పోలీసు శాఖలో పలు విభాగాలు, ఇతర జిల్లాల ఉద్యోగులు, అధికారులు, ఏపీఎస్ఆర్టీసీ(ప్రజా రవాణా సంస్థ), గ్రే హౌండ్స్, ఇతర జిల్లాల గ్రేహండ్స్, 16వ బెటాలియన్ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు, ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఎ.మల్లికార్జున సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరుగుతున్న విధానం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నగరానికి మణిమకుటం

ఇనార్బిట్‌మాల్‌తో మారనున్న విశాఖ రూపురేఖలు

- చురుగ్గా సాగుతున్న మాల్ నిర్మాణ పనులు
- రూ.600 కోట్లతో 17 ఎకరాల్లో నిర్మాణం
- గతేడాది ఆగస్టులో శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి
- తొలి దశలో 8 వేలు, రెండో దశలో 3 వేల మందికి ఉపాధి అవకాశాలు
- సీఎం వైఎస్ జగన్ సూచనల మేరకు ఐటీ టవర్స్ ఏర్పాటు
- రెండో దశలో 2.5 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఐటీక్యాంపస్ నిర్మాణం

ఇనార్బిట్‌మాల్ ప్రత్యేకతలు

నిర్మిస్తున్న సంస్థ : రహేజా గ్రూప్
విస్తీర్ణం : 17 ఎకరాలు
ఎక్కడ : ఉత్తర నియోజకవర్గంలోని కైలాసపురంలో
ఎవరి స్థలం : విశాఖపట్నం పోర్టు అథారిటీ
లీజు : 30 ఏళ్లకు రూ.125 కోట్లు చెల్లింపు
పూర్తయ్యేది : మూడేళ్లలో

నిర్మాణం ఎలా ఉంటుంది :

రెండు బేస్‌మెంట్ ప్లస్ 3 స్టిల్ట్ ఫ్లోర్స్, 5 ఫ్లోర్లు రీటైల్ కోసం, 6వ ఫ్లోర్ మల్టీలెవల్ కార్ పార్కింగ్ కోసం, 7,8 ఫ్లోర్లు ఆఫీస్ స్పేస్ కోసం, 9వ ఫ్లోర్‌లో హోటల్ కోసం నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు.

ఇప్పటివరకు ఈ మాల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయి :

హైదరాబాద్, ముంబై(మలద్), నవీ ముంబై(వసై), వడోదర, బెంగళూరు, పుణే



శరవేగంగా జరుగుతున్న ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులు

సాక్షి, విశాఖపట్నం : ఒక ప్రాజెక్టు.. నగర స్వరూపాన్నే మార్చేస్తుంది. ఉదాహరణకు హైదరాబాద్‌నే తీసుకుందాం. దుర్గం చెరువు ప్రాంతమంటే నగర శివారు. కానీ అక్కడికి ఇనార్బిట్ మాల్ వచ్చింది. అంతే కేవలం ఏడాది కాలంలోనే దుర్గం చెరువు రూపురేఖలు మారిపోయాయి. ముఖ్యమైన సెంటర్‌గా, రద్దీ ప్రాంతంగా, వ్యాపార, వాణిజ్య, ఉపాధికి కేంద్రంగా నిలిచింది. ఇప్పుడు అదే ప్రాజెక్టు విశాఖ నగరం నడిబొడ్డున నిర్మితమవుతోందంటే ఆ ప్రాంతం ఇంకెంతలా అభివృద్ధి చెందుతుందో ఊహించుకోవచ్చు. నగరంలోని ప్రధాన రహదారికి సమీపంలో దక్షిణాదిలోనే అతిపెద్ద ఇనార్బిట్ మాల్‌ని రహేజా సంస్థ నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏకంగా 11 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రహేజా పనులు ఎలా సాగుతున్నాయి.. ఇనార్బిట్ మాల్ రాకతో కైలాసపురం ప్రాంతం మరో ఏడాది కాలంలో ఎలా మారబోతోందో ఓసారి పరిశీలిస్తే..

రూ.600 కోట్లతో ఇనార్బిట్ మాల్‌ను నిర్మించేందుకు రహేజా సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మాల్ పనులకు గతేడాది ఆగస్టు 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రహేజా గ్రూప్స్ ప్రెసిడెంట్ నీల్ రహేజా ఆహ్వానం మేరకు సీఎం జగన్ ఈ కీలక ప్రాజెక్టు పనులకు పచ్చజెండా ఊపారు. అప్పటి నుంచి ఎలాంటి అవరోధాలు లేకుండా శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

రెండో దశలో ఐటీ స్పేస్ ఏర్పాటు

ఇక్కడ ఐటీ స్పేస్ కూడా ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్ సంస్థ ప్రెసిడెంట్ నీల్ రహేజాకు శంకుస్థాపన రోజు సూచించారు. ముఖ్యమంత్రి అడిగిన వెంటనే.. రహేజా సైతం అక్కడే ప్రకటించింది. మొదటి దశ పూర్తయిన తర్వాత.. రెండో దశలో ఐటీ స్పేస్ నిర్మాణం చేపడతామని స్పష్టం చేసింది. 2.5 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్ ఏర్పాటు కానుంది. దీనికి సమీపంలోనే కన్వెన్షన్ సెంటర్ కూడా రాబోతోంది.

మాల్‌తో మారబోతోందిలా..?

ఇనార్బిట్ మాల్‌లో కీలకమైన షాపింగ్ మాల్స్ రానున్నాయి. దేశీయ, విదేశీ రెస్టారెంట్స్ కూడా ఏర్పాటు చేస్తారు. ప్లే ఎరీనా, హోటల్స్, రీటైల్‌షాపింగ్, థియేటర్స్.. ఇలా భిన్నమైన వాణిజ్య సముదాయాలతో నిండిపోనుంది. ఇక్కడ కొనుగోలు చేసేందుకు రోజూ వేల మంది రానున్నారు. ఈ కారణంగా ప్రాంతమంతా జన రద్దీతో కళకళలాడుతుంటుంది. చుట్టుపక్కల చిన్న చిన్న దుకాణాల్లోనూ వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఐటీ పరిశ్రమలు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటైతే.. తిరుగులేని ప్రాంతంగా డెవలప్ అవుతుంది. ఈ ప్రాంతంలోని ఇళ్లు, స్థలాలకు డిమాండ్ పెరుగుతుంది. కైలాసపురం కీలక కేంద్రంగా మారనుంది.

లూలూ వస్తే లాసే తప్ప.. లాభం లేదు.!

వేల మందికి ఉపాధినిచ్చే లూలూని తరిమేశారంటూ అడ్డగోలుగా పచ్చపత్రికల్లో కథనాలు రాస్తున్నాయి. దీని వెనుక ఉన్న కుంభకోణం, వాస్తవాల్ని ఓసారి పరిశీలిస్తే.. చంద్రబాబు ప్రభుత్వం విశాఖ బీచ్ ఎదురుగా ఉన్న రూ.680 కోట్ల విలువైన 13.59 ఎకరాల భూమిని నామమాత్రపు లీజుతో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ పేరుతో లూలూ గ్రూపుకు కట్టబెట్టింది. పైగా 2017లో లీజు తీసుకున్న లూలూ సంస్థ 2019 నవంబర్ వరకు ఒక్క రూపాయి లీజు కూడా చెల్లించలేదు. అన్ని విషయాలు పరిశీలించిన తర్వాతే ప్రజా ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ విధించిన నిబంధనలను అనుసరించే లూలూ గ్రూపుతో ఒప్పందాన్ని రద్దు చేసి, వందల కోట్ల విలువైన భూమిని వైఎస్ జగన్ ప్రభుత్వం కాపాడింది. లూలూ ఏర్పాటై ఉంటే.. విశాఖ ప్రజలకు తీరని నష్టం.. చంద్రబాబుకు గొప్ప లాభం ఉండేది. లూలూ వెళ్లిపోయిందంటూ పెడార్థాలు తీస్తున్న టీడీపీ, దుష్ట చతుష్టయానికి నగరం నడిబొడ్డులో నిర్మితమవుతున్న దక్షిణాదిలోనే అతిపెద్ద ఇనార్బిట్ మాల్ మాత్రం కనిపించకపోవడం విడ్డూరం.

ప్రాజెక్టు వివరాలివీ...

ఫేజ్–1లో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి రహేజా గ్రూప్ రూ.600 కోట్ల వ్యయం చేస్తోంది. 6 లక్షల చదరపు అడుగుల్లో మాల్, 4 లక్షల చదరపు అడుగుల పార్కింగ్ ప్రాంతం నిర్మించనుంది. 2026 కల్లా దీన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 250 జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ స్టోర్స్, మల్టిప్లెక్సులు, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్, ఫుడ్ కోర్టు, టెర్రస్ గార్డెన్, షాపింగ్ స్పేస్ రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 8 వేల మందికి ఉపాధి కలగనుంది. అన్నీ కూడా గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. ఈ మాల్‌ని మూడేళ్లలోపు పూర్తి చేయాలని రహేజా సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ప్రచార పర్వం



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, తదితరులు



వృద్ధురాలికి నమస్కరిస్తున్న వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



ములగాడ హౌసింగ్ కాలనీలో చిన్నారిని ఎత్తుకుంటున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ సోదరి పిల్లా రమాకుమారి

వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి గెలిపించండి

- న్యాయవాదులకు విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ. చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఉత్తర, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థులు కె.కె.రాజు, ఎంవీవీ

విశాఖలీగల్: పేదల ప్రభుత్వమైన వైఎస్సార్‌సీపీకి న్యాయవాదులంతా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కోరారు. జిల్లా కోర్టు గ్రంథాలయంలో సోమవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ యువ న్యాయవాదుల కోసం లానేస్తం వంటి పథకాలను ప్రవేశపెట్టారని, న్యాయవాదులకు మేలు చేసేలా అనేక చర్యలు చేపట్టారని తెలిపారు. ల్యాండ్ టైటిల్ విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. న్యాయవాదులంతా పార్టీకి మద్దతిచ్చి సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. న్యాయవాదులు వైఎస్సార్‌సీపీకి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, కార్యదర్శి డి.నరేష్, ఇతర న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం



సమావేశానికి హాజరైన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి. చిత్రంలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ
- కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ఆత్మీయ సమావేశం

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనతోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం, సాధికారత సాధ్యమవుతాయని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనతో సీఎం జగన్ సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారన్నారు. నవరత్నాలతో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. రానున్న రోజుల్లో ఇదే ఒరవడి కొనసాగాలంటే వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి మరోసారి అఖండ విజయాన్ని అందించాలన్నారు. పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఆత్మీయ సమావేశం నిర్వహించి కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆయా సామాజిక వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట రాజీవ్, బోండా శ్రీనివాసరావు, పీవీ నారాయణ, మధుపాడ రవికుమార్, తలారి సురేష్, సూర్యారావు, అప్పలనాయుడు, ఉమా మహేష్, గోవర్ధనరావు, శిరీష, సత్య, సాగరిక, వరలక్ష్మి, జ్యోతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం

- రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్
- చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: చందనోత్సవం రోజు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్ సూచించారు. ఈ నెల 10న నిర్వహించనున్న చందనోత్సవ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలను, ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తితో సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చందనోత్సవం నిర్వహించాలని సూచించారు. భక్తులందరికీ కనీస సౌకర్యాలు కల్పించే దిశగా అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఉచిత క్యూలైన్ల భక్తులకు పెద్దపీట వేయాలన్నారు. ఏర్పాట్లపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబే పెద్ద భూబకాసురుడు

- అమరావతి పేరుతో పేదల నుంచి భూదోపిడీ
- జగన్ భూములిచ్చేవారే గానీ లాక్కునేవారు కాదు
- రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూములిచ్చేవారేగానీ లాక్కునేవారు కాదని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. భూముల దోచుకోవడంలో చంద్రబాబు ఆరితేరాడన్నారు. అమరావతి పేరుతో రైతుల నుంచి వేల ఎకరాలు భూములను చంద్రబాబు లాక్కుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఎన్డీఏ అమలు చేయమని చెప్పిందన్నారు. రైతులకు భూ హక్కు కల్పించి మేలు చేయడమే ఈ యాక్ట్ ముఖ్యఉద్దేశమన్నారు. చంద్రబాబు ఫ్రస్టేషన్‌లో మతిభ్రమించి ఏదోదే మాట్లాడుతున్నారన్నారు. బాబు, పవన్ మాటలు, చర్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. చంద్రబాబు తప్పుడు ప్రచారాలను పేదలెవ్వరూ నమ్మడం లేదన్నారు. ఇంటికి తెచ్చిఇచ్చే పింఛన్లనే అడ్డుకున్న చంద్రబాబును ఎవ్వరూ నమ్మే స్థితిలో లేరన్నారు. అవ్వాతాతల మరణాలకు చంద్రబాబు కారణమయ్యాడని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ ఇచ్చిన స్క్రిప్టును మోదీ తన ప్రసంగంలో చదివి వినిపించారన్నారు. గతంలో ఇదే మోదీ పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నాడని విమర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. పోలవరం ఆలస్యానికి చంద్రబాబే కారణమని, పోలవరం నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేస్తుందని తెలిపారు. చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోలో భాగస్వామ్యం ఉందని బీజేపీ ఎందుకు చెప్పలేకపోతుందని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ కాపాడుకోవడం కోసం వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని దీనిపై చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు స్టాండ్ ఏంటో చెప్పాలని వైవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.

నేడే హోమ్ ఓటింగ్

- ఇంటి నుంచి ఓటేయనున్న వృద్ధులు, దివ్యాంగులు
- 1,523 మంది దర ఖాస్తు

మహారాణిపేట : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 85 ఏళ్లు నిండిన వృద్ధులు, 40 శాతం దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునేలా హోమ్ ఓటింగ్ మంగళవారం జరగనుంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. గత నెల 18 నుంచి 22 వరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి హోమ్ ఓటర్లయిన వృద్ధులు, దివ్యాంగులను గుర్తించారు. వారి అంగీకారంతో ఫారం 12డీ అందజేసి, పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరించారు.

9న కూడా ఓటేయొచ్చు

ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,523 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో వృద్ధులు 976, దివ్యాంగులు 547 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 25,777 మంది హోమ్ ఓటర్లు ఉండగా.. వీరిలో వృద్ధులు 8,956 మంది, దివ్యాంగులు 16,821 మంది ఉన్నారు. హోమ్ ఓటర్ పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి ఒకటి చొప్పున రెండు ఓట్లు వేయాల్సి ఉంది. దీని కోసం పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే బ్యాలెట్ పత్రాన్ని రూపొందించారు. మంగళవారం ఓటర్ అందుబాటులో లేకపోతే వారికి ఇంకో ఆప్షన్ కింద ఈ నెల 9న కూడా ఓటు వేసే అవకాశమిచ్చారు.

హోమ్ ఓటింగ్ ఇలా..

ఇప్పటికే హోమ్ ఓటింగ్ కిట్ సిద్ధం చేసి రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన బ్యాలెట్ పత్రాన్ని హోమ్ ఓటర్ పూర్తి చేసి సీల్డ్ బాక్సులో వేయాల్సి ఉంది. అనంతరం ఈ బాక్సులను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తారు. ఆర్వోలు ఈ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తారు. మొత్తం ప్రక్రియను వీడియో తీస్తారు.

జిల్లాలో 51 బృందాలు

హోమ్ ఓటింగ్ కోసం జిల్లాలో మొత్తం 51 టీమ్‌లు సిద్ధం చేశారు. భీమిలి నియోజకవర్గంలో 9, విశాఖ తూర్పులో 6, దక్షిణలో 6, ఉత్తరలో 12, పశ్చిమలో 8, గాజువాకలో 5, పెందుర్తి జోన్ 5 చొప్పున బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో స్థానిక బీఎల్వో, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జి, గెజిటెడ్ ఆఫీసర్, మార్కెడ్ కాపీ ఇన్‌చార్జి, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. వీరి భద్రత కోసం పోలీస్‌ను నియమించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఒక వీడియోగ్రాఫర్ చిత్రీకరిస్తారు.

కొటేస్తే జాబితాలో మార్క్

హోమ్ ఓటింగ్‌లో పేరు నమోదు చేసుకున్న వారు మే 13న పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటు వేసే అర్హతను కోల్పోతారు. ఓటర్ జాబితాలో ఈ పేరు ఓటు వేసినట్టుగా మార్క్ చేసి ఉంటుంది.

ఓటేసే దివ్యాంగులకు వీల్ చైర్ల వితరణ



వీల్ చైర్లను అందిస్తున్న కోరమాండల్ సంస్థ ప్రెసిడెంట్ అమీర్ అల్వి

మల్కాపురం : ఎన్నికల్లో ఓటు వేసే దివ్యాంగుల సౌకర్యార్థం కోరమాండల్ సంస్థ వంద వీల్ చైర్లను అందజేసింది. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున అభ్యర్థన మేరకు వీటిని అందజేస్తున్నట్టు కోరమాండల్ సంస్థ అధ్యక్షుడు (మేనుఫ్యాక్చరింగ్) అమీర్ అల్వి, యూనిట్ హెడ్ జ్ఞాన సుందరం, డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ టీం వి.రమామణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ సునీత పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చీఫ్ రీజనల్ సెక్రటరీగా సూర్యప్రకాష్



సూర్యప్రకాష్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీతంపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం మాడ్యూల్ చీఫ్ రీజనల్ సెక్రటరీగా బి.సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. డిప్యూటీ రీజనల్ సెక్రటరీగా టి.గోవిందరాజులు, బాలే రమేష్‌నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాసూరి స్రవంతి గెలుపొందారు. సూర్యప్రకాష్‌తోపాటు వీరు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన చీఫ్ రీజనల్ సెక్రటరీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ విశాఖ మాడ్యూల్‌ను శక్తివంతంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌బీఐ ఆఫీసర్లందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. కార్యక్రమంలో సార్ఫ్ సిబ్బంది ఎస్.రమణ, బంగారునాయుడు, సుబ్రహ్మణ్యం, రవిశేఖర్, ఆనంద్, అప్పారావు, సూర్యారావు, ఇతర బ్రాంచీల నుంచి అధిక సంఖ్యలో ఎస్‌బీఐ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జగన్‌కే క్రిస్టియన్ల మద్దతు

- ఏఐసీసీ వ్యవస్థాపన అధ్యక్షుడు ఆనోక్ గేరా



మాట్లాడుతున్న ఏఐసీసీ వ్యవస్థాపకుడు ఆనోక్ గేరా

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ గెలవాలి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలి...అప్పుడే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి. పేదల బతుకులు బాగుపడతాయని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎలక్షన్ కో ఆర్డినేటర్ ఆనోక్ గేరా పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీల మద్దతు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే ఇస్తామని స్పష్టం చేశారు. సోమవారం మర్రిపాలెం వుడా లేఅవుట్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు క్రిస్టియన్లకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సంక్షేమ పథకాలు అందించి పేదలకు ఎంతో మేలు చేకూర్చారని తెలిపారు. నిరుపేదలుగా ఉన్న పాస్టర్లకు, ఆలయాల అర్చకులకు ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అప్పులపాల్జేశాడని జగన్‌పై ఏడ్చావు..ఇప్పుడు నీ మేనిఫెస్టోలో ఏం పెట్టావు..జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే ఎక్కువ చేసి చూపించావు. ఇవన్నీ సాధ్యం కావు అని తెలిసినా ప్రజలను మోసగించేందుకు సిద్ధమవడం సిగ్గు అనిపించడం లేదా..చంద్రబాబు అంటూ దుయ్యపట్టారు. సీఎం జగన్ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు పాలన చేరువ చేశారన్నారు. వలంటీర్లను విమర్శించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వారి మేనిఫెస్టోలో వలంటీర్లకు జీతాలు పెంచి కొనసాగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మేనిఫెస్టోలో ప్రతీ హామీ అమలు చేసే సత్తా ఉన్న నేత మా జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు ఎస్ఏ రహమాన్, పేడాడ రమణ కుమారి, ఏఐసీసీ విశాఖ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ సీహెచ్ జాన్ రత్నం, నేషనల్ ట్రెజరర్ కీర్తన, కో ఆర్డినేటర్లు శామ్యూల్ రెడ్డి, ఐజాక్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళకు ట్రాచల్ డైలేషన్ చికిత్స



చికిత్స పొందిన మహిళతో మెడికవర్ వైద్యులు

ఎంవీపీ కాలనీ: మెడికవర్ వైద్యులు 59 ఏళ్ల మహిళకు ట్రాచల్ డైలేషన్(శ్వాసనాళాన్ని బెలూన్ ద్వారా వెడల్పు చేయడం) చికిత్సను విజయవంతంగా చేశారు. ఈ మేరకు చికిత్స వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో వివరించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళకు పలు పరీక్షలు చేసి ట్రాచల్ స్టెనోసిస్ ఉన్నట్లు పల్మనాలజిస్ట్ డాక్టర్ సత్య పద్మజ నిర్ధారించారు. శ్వాస కోశ పనితీరులో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా శ్వాసనాళాన్ని బెలూన్ ద్వారా వెడల్పు చేసే అరుదైన ట్రాచల్ డైలేషన్ చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం బాధిత మహిళ పూర్తి స్థాయిలో కోలుకున్నారు. పల్మనాలజిస్ట్ చీఫ్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్, డాక్టర్ మోనిషా, డాక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తొలివిడత చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత సోమవారంతో ముగిసింది. ఈ నెల 10న చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు స్వామికి మూడు మణుగుల పచ్చి చందనం(120 కిలోలు) సమర్పించనున్నారు. ఇందుకోసం ఈ నెల 4వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు శనివారం 36 కిలోలు, ఆదివారం 45 కిలోలు, సోమవారం 39 కిలోల చందనం అరగదీశారు. ఆలయ వైదికులు చందనాన్ని తూకం వేసి బాండాగారంలో భద్రపరిచారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమ్మర్ స్పెషల్ రెండు ట్రిప్పులు మాత్రమే...

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంబల్‌పూర్-కాచిగూడ- సంబల్‌పూర్ మధ్య దువ్వాడ మీదుగా స్పెషల్ రైళ్లు జూన్ 24వ తేదీ వరకు 7 ట్రిప్పులు నడుపుతున్నట్లు ఆదివారం వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. కానీ వీటిని కుదించి కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే నడుపుతున్నట్లు సోమవారం మరో ప్రకటనలో తెలిపారు.

- సంబల్‌పూర్-కాచిగూడ(08323) సమ్మర్‌స్పెషల్ సంబల్‌పూర్‌లో ఈ నెల 13, 20 తేదీల్లో సోమవారం రాత్రి 9గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.20గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.25గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.50గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాచిగూడ-సంబల్‌పూర్(08324) సమ్మర్‌స్పెషల్ కాచిగూడలో ఈ నెల 14,21 తేదీల్లో మంగళవారం రాత్రి 11.20గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30గంటలకు దువ్వాడ చేరుకుని, 12.35గంటలకు బయల్దేరి బుధవారం రాత్రి 11.45గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

హుబ్బళ్లి-నహర్లగున్ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే హుబ్బళ్లి- నహర్లగున్-హుబ్బళ్లి మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు.

- హుబ్బళ్లి-నహర్లగున్(07387) సమ్మర్‌స్పెషల్ ప్రతీ బుధవారం హుబ్బళ్లిలో మధ్యాహ్నం 12.05గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 9.07గంటలకు బయల్దేరి శుక్రవారాల్లో రాత్రి11గంటలకు నహర్లగున్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 5వ తేదీ వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో నహర్లగున్-హుబ్బళ్లి(07388) సమ్మర్ స్పెషల్ రైలు ప్రతీ శనివారం నహర్లగున్‌లో రాత్రి 11గంటలకు బయల్దేరి సోమవారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 3.10గంటలకు బయల్దేరి మంగళవారం ఉదయం 9గంటలకు హుబ్బళ్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 8వ తేదీ వరకు నడుస్తుంది.

సాక్షి ఫోకస్

ఓల్డ్ సిటీ.. న్యూ లుక్


బీచ్‌రోడ్డులో గోకుల్ పార్క్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'విశాఖ దక్షిణం'.. అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కింది. ఓల్డ్ సిటీ.. న్యూసిటీగా రూపాంతరం చెంది పర్యాటకులకు కనువిందు చేస్తోంది. కూడళ్లకు కొత్త రూపు.. బస్టాప్‌ల ఆధునికీకరణ.. ఆహ్లాదకరంగా పార్కులు.. మారిన పాఠశాలల రూపురేఖలు.. యూపీహెచ్‌సీల ఏర్పాటు.. రోడ్ల విస్తరణ.. కొత్త రోడ్ల నిర్మాణం.. ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి.. ఇలా ఒకటేమిటి.. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. వేల కోట్లతో సంక్షేమ పథకాలు అందించి 'దక్షిణ' ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది.

– డాబాగార్డెన్స్

- ప్రగతిపథంలో విశాఖ దక్షిణం
- వేల కోట్లతో అభివృద్ధి పనులు
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- చేరువైన వైద్యం.. బాగుపడిన రోడ్లు

గోకుల్ పార్క్ ఆధునికీకరణ

బీచ్‌రోడ్డులో గోకుల్ పార్క్‌ను రూ.1.09 కోట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కోట్లాది రూపాయలు వెచ్చించి డైమండ్ పార్క్, సరస్వతి పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. పార్కుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు ఆధునికీకరించారు. కూర్చునేందుకు వీలుగా టైల్స్‌తో కూడిన బల్లలు ఏర్పాటు చేశారు.

ఆకర్షణీయంగా బస్‌బేలు

నియోజకవర్గ పరిధిలో రూ.25.93 లక్షలతో జగదాంబ జంక్షన్ వద్ద, రూ.26.33 లక్షలతో ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద, రూ.24.73 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద, రూ.28.45 లక్షలతో లలితా జ్యువెలరీ వద్ద బస్సు బేలు ఆధునికీకరించారు.



జగదాంబ జంక్షన్‌లో ఆధునికీకరించిన బస్ బే

ప్రగతి రహ'దారి'

నియోజకవర్గ పరిధిలో రూ.12.50 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణి బొమ్మ వరకు చేపట్టిన రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ.1.82 కోట్లతో సెవన్ హిల్స్ ఆస్పత్రి నుంచి జగదాంబ జంక్షన్ వరకు, రూ.1.71 కోట్లతో వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.5 కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పాతపోస్టాఫీస్, సౌత్‌జైల్ రోడ్డు నుంచి కాన్వెంట్ జంక్షన్(వయా చావులమదుం) వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.1.10కోట్లతో వెలంపేట రోడ్డు, మున్సిపల్ స్టేడియం జంక్షన్ నుంచి దుర్గాలమ్మ గుడి జంక్షన్ వరకు, కోటవీధి జంక్షన్ నుంచి సెయింట్ అలోసిస్ స్కూల్ వరకు, రూ.39.90 లక్షలతో కాన్వెంట్ జంక్షన్ నుంచి జ్ఞానాపురం శివాలయం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. జగదాంబ జంక్షన్ నుంచి లీలా మహల్ జంక్షన్ వరకు, లీలామహల్ జంక్షన్ నుంచి డాబాగార్డెన్స్ వరకు, లీలామహల్ జంక్షన్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు రోడ్లను ఆధునికీకరించారు.


మున్సిపల్ స్టేడియం రోడ్డు


జగదాంబ జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్


అభివృద్ధి చెందిన జీవీఎంసీ ప్రకాశరావుపేట ఉన్నత పాఠశాల

మసీదుల అభివృద్ధికి..

నియోజకవర్గంలో మసీదుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. 30వ వార్డులో అంగటిదిబ్బ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. రూ.50 కోట్లకు పైగా విలువైన 5 ఎకరాల స్థలం కేటాయింపు ప్రతిపాదనలు ఉన్నాయి. జీవీఎంసీ 37వ వార్డు బీచ్‌రోడ్డులోని శ్మశానవాటిక అభివృద్ధికి రూ.కోటి 90 లక్షలు కేటాయించగా.. పనులు జరుగుతున్నాయి.

నియోజకవర్గంలో సంక్షేమ ఫలాలు ఇలా..

పథకం	లబ్ధిదారులు	విలువ (రూ.కోట్లలో)
అమ్మఒడి	19,360	72.08
విద్యా దీవెన	12,817	37.10
వసతి దీవెన	10,010	14.34
విదేశీ విద్యా దీవెన	313	82
మత్స్యకార భరోసా	5,884	11.72
పెన్షన్ కానుక	19,732	13.01
చేయూత	11,295	35.62
సున్నా వడ్డీ	31,883	7.22
కాపు నేస్తం	773	2.22
ఈబీసీ నేస్తం	579	1.20
కల్యాణమస్తు/ షాదీ తోఫా	198	1.01
ఆరోగ్యశ్రీ	8,169	22.54
ఆరోగ్య ఆసరా	4,805	4.01
హౌసింగ్	8,316	44.06
బీమా	451	4.09
వాహనమిత్ర	2204	5.11
చేదోడు	2,599	2.38
ప్రత్యేక కోవిడ్ సహాయం	40,988	7.78
తోడు	2,474	8.18
విద్యాకానుక	5321	3.70
ట్యాబ్‌ల పంపిణీ	864	1.02
ఇంటింటికి రేషన్	43,083	68.49

పాఠశాలలు అదుర్స్

నాడు నేడులో భాగంగా మొదటి విడతలో రూ.82.59 లక్షలతో ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల, రూ.31.42 లక్షలతో జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల, రూ.22.26 లక్షలతో చెంగల్రావుపేట ప్రాథమిక పాఠశాల, రూ.12.78 లక్షలతో అల్లిపురం పాఠశాల, రూ.41.36 లక్షలతో ఎంవీడీఎం పాఠశాల, రూ.25.29 లక్షలతో ఆర్‌బీఎంయూపీ పాఠశాలకు మరమ్మతులు చేపట్టారు. రెండో విడతలో రూ.69 లక్షలతో పలు పాఠశాలలను తీర్చిదిద్దారు. అలాగే రూ.1.42 కోట్లతో ప్రభుత్వ బాలికల కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించారు.


మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కేంద్రం

ఆరోగ్యభాగ్యం

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో నాలుగు యూపీహెచ్‌సీలను కొత్తగా ఏర్పాటు చేశారు. దొండపర్తిలో రూ.98 లక్షలతో, జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో రూ.1.04 కోట్లతో, 34వ వార్డు కొబ్బరితోటలో రూ.1.16 కోట్లతో, 37వ వార్డు జబ్బరితోటలో రూ.కోటికిపైగా నిధులతో నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రజలు ఆరోగ్య సేవలు పొందుతున్నారు. రూ.10 లక్షలతో చెంగల్రావుపేట, రూ.10 లక్షలతో వన్‌టౌన్, రూ.10 లక్షలతో ప్రసాద్ గార్డెన్స్, రూ.10 లక్షలతో అల్లిపురం **యూపీహెచ్‌సీలను ఆధునికీకరించారు.**


కొబ్బరితోట యూపీహెచ్‌సీ

కేజీహెచ్‌కు కొత్తరూపు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేజీహెచ్ కొత్తరూపు సంతరించుకుంది. మౌలిక వసతులు కల్పించడంతో పాటు వార్డులను అభివృద్ధి చేశారు. మార్చురీని ఆధునికీకరించారు. సీఎస్సార్ బ్లాక్‌లో కార్పొరేట్ లుక్‌తో వార్డులను తీర్చిదిద్దారు. భావనగర్ వార్డులో ఏసీలు, కర్టెన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. క్యాజువల్టీని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని క్యాజువల్టీలో మరో బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. ఓపీ కౌంటర్లు అత్యాధునికంగా తీర్చిదిద్దడమే గాక పేషెంట్లు ఇబ్బంది పడకుండా ఏసీ సౌకర్యం కల్పించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేశారు. గుండెజబ్బుల వార్డు, గైనిక్, సర్జికల్ వార్డులను మరమ్మతులు చేశారు.


కేజీహెచ్‌లో అధునాతన పడకల ఏర్పాటు

26,650 మందికి గృహయోగం

నియోజకవర్గంలోని 26,650 పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరింది. 16,245 కుటుంబాలకు సెంటు(48 గజాలు) భూమి చొప్పున కేటాయించారు. లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.285 కోట్ల 79 లక్షలు కేటాయించింది. 8,316 మందికి టిడ్కో ఇళ్లు కేటాయించారు. ఇందుకు గానూ ప్రభుత్వం రూ.34 కోట్ల 3 లక్షలు ఖర్చు చేసింది. ఇళ్ల స్థలాలు ఉండి ఇంటిని నిర్మించుకునే 2,089 మందికి బీఎల్‌సీ స్కీమ్ కింద రూ. 51 కోట్ల 30 లక్షలు కేటాయించింది.


రామకృష్ణా వీధిలో నిర్మించిన టిడ్కో గృహసముదాయం

అభివృద్ధి.. సంక్షేమం..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 వేల కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. 26,650 మంది సొంతింటి కల నిజమైంది. కొత్తగా బస్‌బేలు వచ్చాయి. యూపీహెచ్‌సీల ద్వారా ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయి. రోడ్లు అద్దాల్లా మెరుస్తున్నాయి. జంక్షన్లు, పార్కులు కొత్త రూపును సంతరించుకున్నాయి. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయి. ప్రజా దర్బార్, గడపగడపకు మన ప్రభుత్వం తదితర కార్యక్రమాల ద్వారా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నాను. రూ.3 కోట్లకు పైగా సొంత నిధులతో వేలాది మంది పేదలకు ఆర్థిక సహాయం అందించాను. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే నా లక్ష్యం.

– వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి

జంక్షన్లు జిగేల్..

నియోజకవర్గ సుందరీకరణలో భాగంగా కూడళ్లు, ఐలాండ్లు, రోడ్లకిరువైపులా ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. జగదాంబ జంక్షన్ వద్ద రూ.2.3 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇక్కడి తెన్నేటి విశ్వనాథం పార్క్‌లో జంక్షన్‌కు నాలుగు వైపులా కనిపించేలా 20 మీటర్ల ఎత్తులో క్లాక్‌టవర్‌ను ఏర్పాటు చేసే పనులు దాదాపు పూర్తయ్యాయి. చుట్టూ గ్రీనరీ, వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అభివృద్ధి చేస్తారు. అక్కడి నుంచి లేపాక్షి జంక్షన్ వరకు గ్రీనరీతో తీర్చిదిద్దుతారు. జంక్షన్‌కు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసి రంగులు వేస్తారు.

ఇంకా.. ఏం చేశారంటే..

- రూ.500 కోట్లతో కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రులను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేశారు.
- రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు సగానికి పైగా పూర్తయ్యాయి.
- ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన 49 బోట్ల యజమానులకు నష్టం జరిగిన మూడు రోజుల్లోనే రూ.7.11 కోట్ల పరిహారం అందజేశారు.
- రూ.11 కోట్లతో సత్యనారాయణ స్వామి ఆలయానికి పూర్ణామార్కెట్ నుంచి ఘాట్‌రోడ్డు నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి.
- రూ.11 కోట్ల 2 లక్షలతో సీహార్స్ జంక్షన్, చిలకపేట ఏరియాలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు.
- జోన్–4 రూ.9 కోట్లతో క్లోజ్డ్ కాంపాక్షన్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (చెత్త తరలింపు కేంద్రం) పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి.
- రూ.9 కోట్లతో హెరిటేజ్ బిల్డింగ్స్ టౌన్‌హాల్, ఓల్డ్ మున్సిపల్ కార్యాలయాలను ఆధునికీకరించారు.
- రూ.6.5 కోట్లతో మల్టీలెవల్ కార్ పార్కింగ్ కేంద్రాన్ని నిర్మించారు.
- రూ.3 కోట్ల 90 లక్షలతో రామకృష్ణా రైతుబజార్ ఏర్పాటు చేశారు.
- రూ.3 కోట్లకు పైగా 333 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్స్ అందజేశారు.
- ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

వీటితో పాటు మరెన్నో అభివృద్ధి పనులు జరిగాయి.. జరుగుతున్నాయి.



ఆధునికీకరించిన టౌన్ హాల్

ఎదురీత

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ నియోజకవర్గానికి కొత్త. ఎన్నికలకు ముందు అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. నియోజకవర్గంపై ఎటువంటి అవగాహన లేని వ్యక్తి. ఆయన ప్రజలకు అందుబాటులో ఉండరనే అపవాదు ఉంది. వంశీకృష్ణ అభ్యర్థిత్వంపై టీడీపీ, జనసేనతో పాటు స్థానికుల్లో వ్యతిరేకత ఉంది. స్థానికేతరుడికి టికెట్ ఇవ్వడమేంటని జనసేన నేతలు పలు మార్లు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వంశీకృష్ణపై విమర్శలు గుప్పించారు. అలాంటి నాయకుడు తమకేం మేలు చేయగలడని ప్రజలు అంటున్నారు.

రెండేసి సార్లు ముగ్గురికి ఛాన్స్!

- వీరిలో పీవీజీ రాజు, టీఎస్సార్, ఎంవీవీఎస్ మూర్తిలు
- ఇప్పటివరకు విశాఖ లోక్‌సభకు 17 దఫాలు ఎన్నికలు
- ఒక్కరికే దక్కిన కేంద్ర మంత్రి పదవి




సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. అప్పట్నుంచి ఈ ఏడు దశాబ్దాల కాలంలో 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ముగ్గురికి రెండేసి పర్యాయాలు ఎంపీలుగా ఎన్నికయ్యే ఛాన్స్ దక్కింది. మిగిలిన వారికి ఒక్కోసారి అవకాశమిచ్చింది. ఇలా ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎంపీలుగా గెలుపొందిన వారిలో పూసపాటి విజయరామ గజపతిరాజు (పీవీజీ రాజు), టి.సుబ్బరామిరెడ్డి (టీఎస్సార్), ఎంవీవీఎస్ మూర్తిలు ఉన్నారు. పీవీజీ రాజు తొలిసారి 1957లో, రెండోసారి 1971లోనూ ఎన్నికయ్యారు. ఆ తర్వాత టి.సుబ్బరామిరెడ్డి 1996, 1998ల్లో, ఎంవీవీఎస్ మూర్తి 1991, 1999లోను గెలిచారు. వీరిలో పీవీజీ రాజు, సుబ్బరామిరెడ్డిలు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి, మూర్తి తెలుగుదేశం పార్టీ నుంచి విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన వారిని పరిశీలిస్తే.. తొలిసారి 1952లో జరిగిన ఎన్నికల్లో లంక సుందరం, గాం మల్లుదొర (ఇండిపెండెంట్లు), 1957లో పీవీజీ రాజు (కాంగ్రెస్), 1962లో ఆయన కుమారుడు మహారాజ్ కుమార్ (కాంగ్రెస్), 1967లో తెన్నేటి విశ్వనాథం (కాంగ్రెస్), 1971లో పీవీజీ రాజు (కాంగ్రెస్), 1977లో ద్రోణంరాజు సత్యనారాయణ (కాంగ్రెస్), 1980లో కొమ్మూరు అప్పలస్వామి (కాంగ్రెస్), 1984లో భాట్టం శ్రీరామమూర్తి (టీడీపీ), 1989లో ఉమా గజపతిరాజు (కాంగ్రెస్), 1991లో ఎంవీవీఎస్ మూర్తి (టీడీపీ), 1996, 1998ల్లో టి.సుబ్బరామిరెడ్డి (కాంగ్రెస్), 1999లో ఎంవీవీఎస్ మూర్తి (టీడీపీ), 2004లో మాజీ ముఖ్య మంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి (కాంగ్రెస్), 2009లో డి.పురందేశ్వరి (కాంగ్రెస్), 2014లో కంభంపాటి హరిబాబు (బీజేపీ), 2019లో ఎంవీవీ సత్యనారాయణ (వైఎస్సార్‌సీపీ)లు ఉన్నారు. ఈ లెక్కన చూస్తే పలుమార్లు అంటే.. పది పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, మూడు దఫాలు టీడీపీ, రెండు సార్లు ఇండిపెండెంట్లు, బీజేపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఒక్కోసారి చొప్పున గెలుపొందారు.

ఒక్కరికే కేంద్ర మంత్రి ఛాన్స్

ఇంతమంది విశాఖ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికైనప్పటికీ కేంద్ర మంత్రి పదవి మాత్రం ఒక్క పురందేశ్వరికి మాత్రమే దక్కింది. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికైన ఆమెకు మానవ వనరుల శాఖ (2009), వాణిజ్య, పరిశ్రమల సహాయ మంత్రి (2012) పదవి లభించింది. అయితే సుబ్బరామిరెడ్డి కూడా కేంద్ర మంత్రి పదవిని పొందినా ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు వరించింది. ఆయనకు గనుల శాఖ సహాయమంత్రిగా 2006 నుంచి 2008 వరకు కొనసాగారు.

అతివలే నిర్ణేతలు

విశాఖ పార్లమెంట్ పరిధిలో సింహభాగం ఓటర్లు మహిళలే..



- మొత్తం ఓటర్లు 19,26,390..
  పురుషులు 9,48,008
  మహిళలు 9,78,261
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరింటిలో స్త్రీలే అధికం
- ఎన్నికలతో సంబంధం లేకుండా వైఎస్సార్‌సీపీ మహిళలకే ప్రాధాన్యం
- టీడీపీ, జనసేన, బీజేపీ బూటకపు మేనిఫెస్టోతో తరుణిల్ని మోసం చేసే కుయుక్తులు

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల సమరం సమీపిస్తోంది. ఎన్నికల్లో ప్రతి అంశమూ కీలకమే.. అన్ని విషయాల్లో చాకచక్యంగా వ్యవహరించే అభ్యర్థులు.. మహిళల విషయంలో మాత్రం మరింత జాగ్రత్త పడుతున్నారు. ఇంతులను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే సార్వత్రిక ఎన్నికల్లో ఏ అభ్యర్థినైనా అందలమెక్కించేది అతివే. విశాఖ ఎంపీతోపాటు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే అత్యధికంగా ఉన్నాయి. వారి మద్దతు ఏ రాజకీయ పార్టీకి ఉంటుందో ఆ అభ్యర్థే విజయం సాధించే అవకాశాలు ఖాయంగా కనిపిస్తోంది.

పార్లమెంట్ పరిధిలోనూ..

విశాఖ జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తంగా పార్లమెంట్ నియోజకవర్గాన్ని చూసినా మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. ఎంపీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 19,26,390 మంది ఓటర్లుండగా.. ఇందులో 9,48,008 మంది పురుషులు ఉండగా.. 9,78,261 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అంటే మహిళా ఓటర్లు 30,253 మంది అధికంగా ఉన్నట్లు లెక్క.

అసెంబ్లీల్లోనూ అధికమే...

పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. విశాఖ ఎంపీ పరిధిలో విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణతో పాటు భీమిలి, గాజువాక, శృంగవరపుకోట నియోజకవర్గాలున్నాయి. ఇందులో గాజువాక మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లదే పై చేయి. ప్రతి సెగ్మెంట్‌లోనూ 2 నుంచి 6 వేల ఓట్ల వరకూ అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండటం విశేషం.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
విశాఖ తూర్పు	1,42,546	1,49,639	2,92,206
విశాఖ ఉత్తర	1,40,810	1,44,956	2,85,789
విశాఖ దక్షిణ	1,06,454	1,10,282	2,16,770
విశాఖ పశ్చిమ	1,05,207	1,08,221	2,13,439
గాజువాక	1,67,125	1,66,473	3,33,611
భీమిలి	1,78,068	1,84,928	3,63,013
ఎస్ కోట	1,07,798	1,13, 762	2,21,562
పెందుర్తి	1,52,590	1,54,950	3,07,545

మహిళా సాధికారతే ముఖ్యం

మహిళా సాధికారతే ఈ ఎన్నికల్లో కీలకంగా మారనుంది. ఇందుకోసం అన్ని పార్టీలూ శ్రమిస్తున్నాయి. ఈ విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందువరసలో ఉంది. ఎన్నికలతో సంబంధం లేకుండా అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి వారికోసం అనేక సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టింది. రూ.లక్షల విలువ చేసే ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ కూడా వారి పేరుతోనే చేపట్టింది. అమ్మఒడి, చేయూత, తదితర పథకాలకు సంబంధించి నేరుగా మహిళల ఖాతాల్లోనే డబ్బులు జమచేసి వారికి ఆర్థిక భరోసా కల్పించింది. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీ పేరుతో మోసం చేసింది. ఈ సారి అలవి కాని హామీలిస్తున్నా బాబు, పవన్ అండ్ కోని నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నది క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.

నిజంగా ప్రభావితం చేస్తారా.?

మహిళలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడంలోనూ ముందు వరసలో ఉంటారన్నది కొట్టిపారేయలేని వాస్తవమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. మహిళలు రాజకీయ తాయిలాలు, ప్రలోభాలు, ఉచితాలకు ప్రభావితమయ్యే ఛాన్స్‌లు తక్కువనీ.. గడిచిన ఐదేళ్ల కాలంలో తమ జీవితాలు ఎలా మారాయి.? రాబోయే ఐదేళ్ల కాలానికి ఇచ్చిన హామీల మేరకు ఎలా మారబోతున్నాయన్నదాన్నే మహిళా ఓటర్లు ఎక్కువగా చూస్తారని తెలుస్తోంది. ప్రభుత్వాల పాలన తీరును ప్రతి మహిళా నిశితంగా గమనిస్తూ తమ ప్రయోజనాలకు ఏ పార్టీ పెద్దపీట వేస్తుందో సరిపోల్చుకుంటున్నారు. మహిళా సంక్షేమం, సాధికారతను ఏ పార్టీ అమలు చేస్తే అటువైపే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. కాబట్టి ఈసారి ఎన్నికల ఫలితాలను శాసించే శక్తి మహిళా ఓటు బ్యాంకుకు ఉందన్నది స్పష్టమవుతోంది.

తల్లీ.. తరుణీ.. కరుణించు

మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేక వ్యూహాల్లో నిమగ్నమయ్యారు. క్షేత్రస్థాయి ప్రచారంలోనూ మహిళల్ని ఆకట్టుకునేందుకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అభ్యర్థుల సతీమణులు, కుమార్తెలు, కుటుంబంలోని ఇతర మహిళలు సైతం ఇంటింట ప్రచారం చేస్తున్నారు. బొట్టు పెట్టి మరీ తమ భర్త, తండ్రి, బంధువుకే ఓటు వేయాలంటూ మహిళా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ర్యాలీలు, రోడ్‌షోల్లోనూ మహిళలే ఎక్కువగా కనిపించేలా జాగ్రత్తలు తీసుకుంటూ ఉండటం విశేషం.